కథానిక

# గాయపడిన హృదయం

చావలి సాంబశివరావు

ప్రతి సంవత్సరం వేసంగి సెలవుల్లో మాఅక్కయ్య గారి వూరు వెళ్ళటం, వాళ్ళింట్లో పదిరోజుల పాటు మకాంవేసి తిరిగి వస్తూండటం నాకు మామూలు. బి.ఏ. మొదటి సంవత్సరం అయిపోయింది. సెలవులిచ్చారు. అలవాటు ప్రకారం మా అక్కయ్యగారి వూరు వెళ్తున్నాను. కాని, మునుపటి మాదిరిగా సంతోషంతోనూ ఉత్సాహంతోనూ కాదు సంతాపంతోనూ, దుఃఖంతోనూ వెళ్తున్నాను. నేను వస్తానని ఆనందంతో ఎదురుచూసే హృదయం యిప్పు డక్కడలేదు. నేను వెళ్ళగానే ప్రేమతో నన్నాహ్వానించే పవిత్రహృదయం ఈ మాటు నాకు కనపడదు. నేను చెప్పే కబుర్లని, కథలని బహు శ్రద్ధగా ఆలకించి, లోలోపల మురిసిపోయే అమాయిక హృదయాన్నిక నేను చూడలేను.

ఆ హృదయం ఎవరో కాదు...నా మేనల్లుడు సుబ్బులు.

సుబ్బులు మా అక్కయ్య రెండో కొడుకు. పెద్దవాడి పేరు, రాము. మూడోవాడి పేరు, ప్రసాద్.

మాఅక్కయ్యకిగాని, మాబావకిగాని సుబ్బులు మీద అంత ప్రేమలేదు. రాముని చూసినా ప్రసాద్‌ని చూసినా వాళ్ళకి ఎక్కడలేని ప్రేమా పుట్టుకొస్తుంది. అందుకు కారణం బహుశా సుబ్బులు అన్నకంటేను, తమ్ముని కంటేను కొంచెం అందహీనుడు కావటం యేమో!

అదేమి చిత్రమోగాని ప్రతి విషయంలోనూ, సుబ్బులికి అన్యాయం జరిగేది. రాము యస్. యస్. యల్. సి తప్పినా పన్నెత్తి వాని నొక్క చిన్నమాట వినా అనని తల్లిదండ్రులు, సుబ్బులికి మూడ్నెల్ల పరీక్షల్లో ఒకటి రెండు సబ్జక్టుల్లో తక్కువ మార్కులొస్తే వాడిని "నీదొడ్డి మట్టి బుర్రరా గాడిదా" అని తిట్టిపోసేవారు. దాంతో వాడి మనస్సు చివుక్కుమనేది. ఆ విషయమే, ఆ మాటలే ప్రతినిమిషం వాని లేత మనస్సులో గింగురు మంటూండేవి.

చొక్కాలూ లాగులూ కుట్టించేప్పుడైనా, రాము, ప్రసాద్‌లకు వాళ్ళకినచ్చిన రకం గుడ్డ కుట్టించేవాళ్ళు. సుబ్బులు "అదేం?"అని అడిగితే: "వాడు పెద్దవాడు, పెద్దక్లాసు చదువుతున్నాడు. వాడికి నచ్చినవి వాడు కుట్టించుకోవలసిందే. ప్రసాద్ చిన్నవాడు-వానికి మంచివి కుట్టించక పోతే ఎట్లా?..." ఇదీ సమాధానం. "కాదూ, కూడదూ" అంటే చెంపలు ఛెళ్ళుమనేవి.

సుబ్బులు అసలు పేరు సుబ్రహ్మణ్యం. వాడు ఆడుకునేందుకు వెళ్ళితే వాడిని తోటి పిల్లలందరూ "సుబ్రహ్మణ్యం-కొబ్బరికాయా-నీకో ముక్కా-నాకో ముక్కా"అని పాడుతూ ఏడిపించేవాళ్లు. సుబ్బులు సహజంగా సిగ్గు బిడియం కలవాడు. సాత్వికుడు-అమాయకుడు. వాడు ఎంత చిన్న మాటనయినా సరే భరించలేడు. వాడికి నిమిషంలోకి ఉడుకుమోతుతనం వస్తుంది. కాని వాళ్ళని తిరిగి ఏదైనా అని ఏడ్పించేటంత చాకచక్యం గాని, నాలుగు తన్నేటంత ధైర్యంగాని వాడికి లేవు-అందువల్ల వాడు ఆ మాటలనే పదేపదే తలచుకొని తనలో తాను కుమిలికుమిలి ఏడ్చే వాడు. ఇక మళ్ళీ ఆటలకి వెళ్ళేవాడు కాదు.

ఇటువంటి స్వభావా లున్నవాడవటంవల్లనూ, ప్రతి విషయానికీ ఇంట్లోగాని బయటగాని వానిని ఎవరో ఒకరు ఏదో ఒకమాట అంటూండటం వల్లనూ, హృదయంలో బాధ ఎక్కువైపోయి వాడు నిత్యం విచారంలో మునిగివుండేవాడు. అంచేత కాలక్రమేణా వాని ముఖంలో చిరునవ్వు అనేది మాయమయిపోయింది.

పాపం! వాని లేత మనస్సులోని బాధ నంతటినీ విని ఓదార్చే సహృదయులు ఎవ్వరూ లేరు.

అందువల్ల వేసంగి సెలవులికి నేను వాళ్ళవూరు వెళ్ళినప్పుడు వాడు నాకు తన అమాయిక హృదయానికి తగిలిన గాయాల్ని చూపేవాడు; తన లోతు గుండెలోని బాధల్ని వెళ్ళగ్రక్కేవాడు అవన్నీ సహనంతోనూ, సానుభూతితోనూ విని నేను వానికి మనస్సుకు వినోదాన్నీ, విజ్ఞానాన్నీ యిచ్చే కథల్ని చెప్పేవాడిని. దాంతో వాని మనస్సు కొంతవరకు ఊరట చెందేది.

“నువ్వు కథలు రాస్తావుటగా. నామీద కూడా ఒక కథ రాయరాదా మామయ్యా!” అని వాడు ఆప్యాయంగానూ, అమాయికంగానూ అడిగేవాడు. నేను “అట్లాగే”అని నవ్వేసేవాడిని. మరుసటి సంవత్సరం రాగానే మళ్ళీ అదే ప్రశ్న వేసేవాడు. నేను-“రాస్తున్నారా, పూర్తికాలే” అనేవాడిని. ఒట్టిదే-నిజానికి రాయటంలేదు. కాని ఈసారి నిజంగానే రాస్తున్నాను... కన్నీటితో రాస్తున్నాను ... కాని... కాని...యేమిలాభం?

సుబ్బులు ఫిప్తుఫారం చదువుతున్నాడు. వాని వయస్సు నిజానికి పదిహేనేళ్లయినా చూడటానికి వాడు యింకా ఎక్కువ ఈడు వున్నట్లుగా కనిపిస్తాడు. అందుకు కారణం బహుశా, వాని నూనూగు మీసాలు, దట్టంగా మోకాళ్ళమీద పెరిగివున్న వెంట్రుకలూ కావచ్చు. కొంచం పెద్దదిగా లావుగా వున్న ముక్కు వాని ముఖానికి వికారాన్ని తెచ్చిపెట్టింది. ఈ సంగతులన్నీ వానికి తెలుసు. అందుకే వాడు మనస్సులో చాలా బాధపడుతారు.

వాని మనస్సు బహుసున్నితమైనది. ఏమాత్రం అవమానాన్నీ, ఎంత చిన్న యెత్తిపొడుపు మాటనీ సహించలేదు.

ఈ స్వభావాలన్నింటికీ తోడుగా వానికి ఇంకా కొన్ని వుండకూడని స్వభావాలున్నాయి- వాడు నలుగురితో కలిసిమెలిసి తిరుగలేడు. ధైర్యంగా నిస్సంకోచంగా, నదురు బెదురూ లేకుండా హుషారుగా వాడు మాట్లాడలేడు. పై గుణాలు కారణంగా వాడు ఒంటరితనాన్ని అభిలషించేవాడుగానూ, మౌన ముద్రితుడుగానూ తయారయ్యాడు.

వానికి చెప్పుకోదగిన స్నేహితు లెవ్వరూ లేరు. ఆటలు ఆడడు. మూగవాడల్లే తిరుగుతాడు. ఎవరన్నా ఏదైనా ఒక మాట అంటే, దాన్ని పట్టుకుని గుంజుకుగుంజుకు గూబలు తెంచుకుంటాడు. వానిమొఖాన చిరునవ్వు అనేది అపురూపము.

వానికి ఇంగ్లీషు తెలుగుల్లో ఫస్టుమార్కులు వచ్చేవి. మిగతాసబ్జక్టుల్లో కేవలం ప్యాసుమార్కులొచ్చేవి.

వాడి క్లాసులో కిష్టుడనేవాడు ఒకడున్నాడు. ఆ కిష్టునికి అన్నిటిలో ఫస్టుమార్కులొచ్చేవికాని ఇంగ్లీషు, తెలుగుల్లో సుబ్బులుకంటే నాలుగయిదు మార్కులు తక్కువ వచ్చేవి. అందువల్ల వాడికి సుబ్బులంటే కక్షమంట. “వీడులేకపోతే తనకే ఇంగ్లీషు తెలుగుల్లో ఫస్టుమార్కులొచ్చేవి కదా, క్లాసులోకల్లా తనే తెలివైనవాడుగా చెలామణి అయ్యేవాడుగదా” అని తలచి వాడు అసూయ చెందేవాడు.

సుబ్బులికి ఏదైనా హానికరమయినపని చెయ్యటానికి వాడు తగిన సమయంకోసం ఎదురుచూస్తున్నాడు. కాని పైకిమాత్రం సుబ్బులుతో స్నేహంగానే వుంటున్నాడు.

* * *

ఆనాడు సాయంత్రం రెండు పీరియడ్లు అయిపోయినవి. ఆఖరి పీరియడు హిందీ.

సుబ్బులు యింకొకని పుస్తకం చూచి సైన్సు నోట్సు రాసుకుంటున్నాడు. కిష్టుడు సుబ్బులు దగ్గరకొచ్చి, “ఒరేయ్, నా పెన్నులో యింకు అయిపోయింది. నీ పెన్సిలు ఓసారి యిస్తావా?” అన్నాడు. సుబ్బులు రాసుకుంటూ “జేబులో వుంది తీసుకోరా” అన్నాడు. కిష్టుడు తీసుకొని వెళ్ళాడు.

మాష్టరు పాఠం మొదలు పెటాడు. “ఫలానిపాఠానికి అర్థాలు రాసుకోండి.” అంటూ బోర్డుమీదరాయటానికిఉపక్రమించి ఏదోరాస్తున్నాడు.

అట్లా ఒక నిమిషం గడిచింది. ఇంతలో టప్ మని ఒక చిన్న పెంకుముక్క లేడీస్ బెంచ్ మీద పడింది.

అందరిదృష్టీ దాని మీదికి మరలింది. మాష్టరు కోపంతో మండి పడ్డాడు. “ఎవ్వరా ఆ రాయి విసిరింది?”అని గర్జించాడు. సమాధానం రాలేదు. పిల్లలంతా భయంభయంగా చూస్తున్నారు.

"మర్యాదగా చెప్తారా, లేదా? చెప్పకపోతే తగినచర్య తీసుకోవలసి వుంటుంది." మాష్టరు బెదిరించాడు.

"జేబులు వెతకండిసార్. ఎవరి దగ్గిరరాళ్లుంటే వాళ్ళే వేసి వుంటారు." కూర్చునే ఒక గొంతుక సలహా యిచ్చింది. ఆ గొంతుక కిష్టుడిది.

మాష్టరు ఒక్కొక్కడినే పిలిచి జేబులు వెదకటం మొదలు పెట్టాడు.

సుబ్బులు తనవంతు రాగానే మాష్టరి దగ్గిరకెళ్ళాడు. మాష్టరు వాడి షర్టు జేబులోని కాగితాలూ, పెన్నూ, అన్నీ తీసాడు. కాగితాల మధ్యలోంచి గోళీకాయ ప్రమాణంలో వున్న ఒక చిన్న పెంకుముక్క టుప్పుమని క్రిందపడింది.

అంతా ఆశ్చర్యపోయారు. సుబ్బులుకూడా ఆశ్చర్యపోయాడు.

"ఏమిటిది?"అన్నట్లు మాష్టరు సుబ్బులుకేసి చూసాడు. సుబ్బులికి తల తీసేసినంత పనైంది. పిల్లలంతా సుబ్బులే లేడీస్‌మీదికి రాయివిసిరాడని నమ్మారు.

"నాకేమీ తెలీదు సార్. ఎవరన్నా నా జేబులో పడేశారేమో సార్"అన్నాడు సుబ్బులు నేరం తనమీదపడుతుందేమో అని భయపడుతూ.

"నీ జేబులో పడేస్తే నీకు తెలియదుట్రా? నీకు తెలియకుండా ఎట్లా పడేస్తారు? చెప్పు— వెధవ పోకిరివేషాలు ఎప్పుడు నేర్చుకున్నావురా? ఇన్నాళ్ళనుంచీ నువ్వు ఏదో తెలివిగలవాడవని, మంచివాడవని అనుకుంటున్నా -ఇదా సంగతీ- తెలిసింగిలే-ముందు హెడ్మాష్టారి దగ్గరికి పద"అని సుబ్బుల్ని హెడ్మాష్టారి గదిలోకి తీసుకెళ్ళాడు. పిల్లలంతా గదికిటికీలవద్ద గుమికూడారు.

హెడ్మాష్టరు జరిగిన సంగతి తెలుసుకుని, సుబ్బుల్ని పేముబెత్తంతో నాలుగుబాది "పోకిరీ వెధవా! అట్లా చెయ్యొచ్చుట్రా?"అన్నాడు.

"నాకేమీ తెలీదు సార్. నేను నిరపరాధిని... నమ్మండి. నన్ను వదలండి"అని ఏడ్చాడుసుబ్బులు.

"రాడీ వెధవల్లే ఆడపిల్లలమీద రాయివేసింది కాక, 'నేనుకాదు' అని అబద్ధమాడ్తావుట్రా, రాస్కేల్; నిజం ఒప్పుకునేదాకా నిన్ను తన్ని పాతేస్తాను"అంటూ హెడ్మాష్టారు వానిని చెడామడా చావబాదాడు.

దెబ్బలు భరించలేక, నిజానికి తాను రాయి విసరనప్పటికీ, సుబ్బులు నేరాన్ని ఒప్పుకున్నాడు.

"అప్పుడే నీ పెళ్ళి అయిందీ, రేపుచెప్తా నీకని-పో! వెధవా పో!"అని హెడ్మాష్టరు సుబ్బుల్ని వదిలివేశాడు.

ఇంతలో యింటిగంట మ్రోగింది. పిల్లలంతా యింటికి వెళ్తున్నారు.

* • *

ఇదంతా చూచిన కిష్టుడికి పట్టలేనంతసంతోషం కలిగింది. సుబ్బుల్ని చూచి లోలోపల ఎంతగానో నవ్వుకున్నాడు. ఎందుకనంటే, అసలీ సంఘటన కంతకూ వాడే కారణం.

వాడికసలు హిందీ మేష్టరుమీద కచ్చవున్నది. అదేమిటంటే, ఆ క్రితంరోజున వాడు హిందీ పద్యం అప్పచెప్పకపోయినందువల్ల ఆయన వాడ్ని రెండుదెబ్బలేసి బెంచీ ఎక్కించాడు. అందుకని వాడు ఆయనమీద రాయివేసి తన కసితీర్చుకుందామనుకున్నాడు. సుబ్బులుమీదకూడ వానికి కచ్చవున్నదాయె. ఒకరాయి వాడిజేబులోవేసి, జేబులు చూడమంటే వాడు కూడా పట్టుపడతాడు. అప్పుడు ఒక దెబ్బకి రెండుపిట్టలు నేలకూలుతవి" అనుకున్నాడు వాడు.

అనుకున్నప్రకారం, రెండోపీరియడు కావటంతోనే వాడు తనుయింటివద్ద సిద్ధంచేసి తెచ్చిన రెండు పెంకుముక్కల్లోనూ ఒకదాన్ని తీసి, పెన్సిలు తీసుకుంటున్నట్లు నటిస్తూ, సుబ్బులు జేబులో మెల్లగా జారవిడిచాడు. పాపమూ పిచ్చి సుబ్బులు అది గమనించనేలేదు. మాష్టరు బోర్డుమీద వ్రాస్తున్నప్పుడు రెండోముక్కనితీసి ఆయనమీదికి విసిరి గుప్‌చిప్ మన్నట్లు కూర్చున్నాడు. కాని వాడిప్లాను సరిగా సఫలమవలేదు. వాడు వేసినరాయి గురితప్పి, బోర్డుప్రక్కనవున్న లేడీస్ బెంచీమీద పడింది... కాని చివరికెట్లాగైనా సుబ్బులికి తగినశాస్తి జరిగిందిగదా అని వాడు మిక్కిలి సంతోషించాడు.

* * *

సుబ్బులు పిల్లలందరికంటే చాలా వెనకాల అడుగులో అడుగేసుకుంటూ నడుస్తున్నాడు.


జరిగిన సంఘటన వానికి మాటిమాటికీ దర్శనమిస్తోంది.

హెడ్మాష్టరు తనని అందరి పిల్లలెదుటా, మేష్టర్ల ఎదుటా కొట్టాడు...ఎంత అవమానం!!! ఎంతవిచారకరం!! ఎంతలజ్జాకరం!!...ఇంక తను నలుగురిలో తలెత్తుకుని తిరగటం మెట్లా?...తను పోకిరీ వెధవ - రౌడీ - ఆడపిల్లలమీద రాళ్ళువేసే దుష్టుడు, నీచుడు—ఇట్లాగేగా తననిక అందరూ పరిగణించేది!...ఈ సంగతి అమ్మా, నాన్నలకి తెలిస్తే బ్రతకనిస్తారా?... అమ్మో!! యింటికి వెళ్ళడమెట్లా? రేపు నాపెళ్ళి వుందిట...ఇంకేం చేస్తాడో ఆ పాషాణ హృదయంగల హెడ్మాష్టరు...ఫలానా వారబ్బాయి యిటువంటి పాడు పని చేశాడు అని అంతా చెప్పుకుంటారే యిక తమకుటుంబానికే యిదొక మాయని మచ్చ? యిటువంటి తీరని కళంకాన్ని తను తెచ్చాడా?.. లేదు-లేదు-ముమ్మాటికీ తను తేలేదు. తనమీద వీళ్ళంతా ఆ నేరాన్ని అన్యాయంగా రుద్దారు. తను ఏపాపం ఎరుగడు....ఎవరీపని చేసారో ఆ భగవంతునికే ఎరుక.

"ఓ శ్రీరామా! నువ్వెక్కడున్నావు? ఈదీనుడు అన్యాయంగా 'దోషి'అని పరిగణింప బడుతుంటే చూస్తూ వూరుకున్నావా?...రావా నన్ను రక్షించవా? దయామయా!" అని సుబ్బులు దీనంగా ఏడ్చాడు. వానిచొక్కా కన్నీటితో తడిసి ముద్ద అయింది. వానిగుండె ఇనుపగుండువలె బరువెక్కింది, దుఃఖంతో.

సుబ్బులు లేతమనస్సు మరియే విధంగా ఆలోచించిందో ఏమో, ఏయేభావాలు వానిమనస్సులో మెదిలినవో ఏమో నాకు తెలియదు. కాని... కాని నాకు ఒకటిమటుకు తెలుసు.

వాని అడుగులు యింటికి పోయేవల్లా, ఒక్కసారిగా వెనక్కు తిరిగినవి, వానికండ్లు ఒక వింత తేజస్సుతో మెరసినవి. వాడు గాలికంటేవేగంగా పరుగెత్త నారంభించాడు. ఆ పరుగు పరుగూ రైలుపట్టాలమీద పడేదాకా ఆగలేదు. అప్పుడే ఆ చిమ్మ చీకటిలో, కన్నూమిన్నూ కానని వేగంతో రైలింజను పొగలుక్రక్కుతూవచ్చింది; సుబ్రమణ్యమనే కొబ్బరికాయని పదిముక్కలుగా చేసి పిల్లలందర్నీ తలోముక్కా ఏరుకోమంది...



నూతన వధూవరులు : ప్రఖ్యాత నర్తకి కుమారి కమల, ప్రఖ్యాత కార్టూన్ చిత్రకారుడు ఆర్. కె. లక్ష్మణ్.